


# ఈతరం పిల్లలు

- గోవిందరాజు సీతాదేవి

ఆదివారం

స్కూళ్ళకీ ఆఫీసులకీ శలవు. ఈ శలవు అంటే శ్రీవారికీ పిల్లలిద్దరికీ పండగ. కానీ నాకు తగని చికాకు. సోమవారం నుంచీ శుక్రవారం వరకూ గడిచే దినచర్య శనివారం నాటికి అస్తవ్యస్తం అయిపోతుంది. శనివారంనాడు రెండు గంటలకే పిల్లలిద్దరూ ఇల్లు చేరుకుంటారు. భోజనం కూడా చేయకుండా టీ.వీ. ఎదురుగా కూర్చుని టక టకా 'ఛానెల్సు' మార్చేస్తూ సౌండ్ పెంచేస్తారు. దానికి నా చెవులు ఘడియలు పడినట్లే అయిపోతుంది.

శశీ, బాబూ భోజనం, టిఫినూ టీ.వీ. దగ్గరే. రాత్రి పదిన్నర వరకూ ఇదే గోల. ఆ తర్వాత ఆవులిస్తూ 'మమ్మీ రేపు ఆదివారం ఏంటి ప్రోగ్రాం'' అంటూ తమ గదిలోకి నడుస్తారు, జవాబు చెప్పకపోతే నావైపు విసుగ్గా చూస్తూ -

"ఆదివారం ఇంట్లోనే వుంటే బోర్ మమ్మీ డాడీతో చెప్పి ప్రోగ్రాం ఏదైనా అరేంజ్ చెయ్యి. ఇదిగో రేపు మమ్మల్ని ఆరింటికే నిద్ర లేపవద్దు'' అంటూ ముసుగు బిగించేస్తారు. ఇంక శ్రీవారు రేపు ఆదివారంగా అని శనివారం రాత్రి ఏ రెండు గంటల వరకూనో శంకరంగారింట్లో పేకాట ఆడీ ఆడీ మెల్లగా వస్తారు. ఆ పేకాట అలవాటు అంటేనే నాకు తగని అసహ్యం. నా అసహ్యాన్ని ఎన్నోసార్లు ఆయనగారి దగ్గర వివరించినా ఆయన తలకి ఎక్కితేగా.

"నీకిష్టం లేదనేగా మనింటి నుంచి శంకరం ఇంటికి మార్చింది'' అంటున్న ఆయన్ని ఏం చేయాలి? ఆవేశం వచ్చినా అసహ్యాన్ని ఆవేశాన్నీ మింగేయటం అలవాటు చేసుకున్న నామీద నాకే కోపం వస్తూంటుంది.

"మమ్మీ'' అన్న పిలుపుకి ఆ ఆలోచనల్లోంచి బైటపడి,

"ఏంటి శశీ!'' అన్నాను.

"రేపు జూ పార్కుకి వెడదాం అని డాడీకి చెప్పు'' అని మళ్ళీ దుప్పటి ముఖం మీదకి లాక్కుంది శశి.

ఈ కాలం పిల్లలు ప్రతి ఆదివారమూ ఏదో ఒక కొత్త ప్రోగ్రాం కావాలి అంటారు. ఇదే వయసులో నా ఆలోచనలు యిలా వుండేవా? వుండేవి కావు. అన్నయ్య పట్నంలో డిగ్రీ చదువుతూ శలవులకి వచ్చినప్పుడు నాకు పండగే.

ఇద్దరం కల్సి ఆడుతూ పాడుతూ పెరట్లో వున్న మొక్కలకి పాదులు చేసి బావిలో నీళ్ళు చేది పోసేవాళ్ళం. అవి పువ్వులు పూస్తే మురిసిపోయేవాళ్ళం.

వంట గదిలో అటక ఎక్కి పాత సామానులు సర్దటంలో అమ్మకి సాయపడేవాళ్ళం.

ఒళ్ళంతా బూజు అంటిన అన్నయ్య చెరువుకెళ్ళి స్నానం చేసి నాకిష్టమని ఎర్రవీ తెల్లవీ కలువపూవులు తెస్తే ఎంతో మురిసిపోయేదాన్ని.

ఆ తర్వాత నానమ్మ పెట్టే చద్దెన్నం, ఆవకాయ మీగడ పెరుగూ వేసుకుని తిని ఎన్నెన్నో కబుర్లు చెప్పుకునేవాళ్ళం. రాత్రిపూట ఆరుబైట నులక మంచం మీద పడుకుని హిందీ సినిమా పాటలు పాడే అన్నయ్య అంటే నాకెంతో ఇష్టంగా వుండేది! ఆ పాటలని నేను పుస్తకంలో రాసుకుని ఆ తర్వాత కూనిరాగాలు తీస్తూంటే ఎంత సంతోషంగా వుండేది! ఆ బాల్యం ఎంత మధురంగా వుండేది.

హైస్కూలు చదువు పూర్తిచేసి అన్నయ్య దగ్గర బస్తీలో వుండి కాలేజీలో చేరతానని మారాం చేస్తే నాన్న మౌనం వహిస్తే -

"ఆడపిల్లకి హైస్కూలు చదువు చాలదూ'' అని అమ్మ విసుక్కుంటే నాకు ఎంత ఏడుపు వచ్చిందో? అప్పుడు నానమ్మ నన్ను దగ్గరగా తీసుకుని -

"అమ్మలూ మీ నాన్నకి మీ అన్నయ్య చదువే బరువై ఏటికి ఎకరం పొలం అమ్మటం నీకు తెల్సుగామ్మా. అదీగాక నీకు ఎంత కట్నం పోస్తే వస్తాడో వరుడు'' అన్నప్పుడు డిగ్రీ చదివి అయ్యేయస్ చేసి పోలీసు ఆఫీసర్ అవ్వాలన్న కోరిక తీరే అవకాశం ఈ జన్మకి లేదని తెల్సి కృంగిపోయే నాకు రాత్రిపూట ఏవేవో కథలు చెప్పేది. నానమ్మ చెప్పే కథల్లో హీరో అద్భుతమైన సాహసాలు చేసేవాడు. ఆ కథలు వింటూ అలాగే నిద్రపోయే నాకు కలల్లో ఆ హీరో కన్పించేవాడు. "సత్యభామా నాతో షికారుకొస్తావా'' అనేవాడు.

"నాకు భయం'' అంటున్న నన్ను తన చెయ్యి అందించి -

"నేనుండగా నీకేం భయం'' అంటూ గుర్రం మీదకి ఎక్కించి గుర్రాన్ని దౌడు తీయించేవాడు. కొండలూ, కోనలూ, నదులూ, లోయలూ తిప్పుతుంటే నా మనసులో ఏవేవో మధురమైన ఊహలు, ఆ వూహల మధ్య వూగుతుండగా తెలతెలవారే వచ్చే సమయం అయేది. అంతే పంచకళ్యాణి గుర్రం నన్ను 'ధాం' అని కిందపడేసి పోయేది. అంతే కల కరిగిపోయేది. మెలుకువ వచ్చేది. అమ్మ వంట గదిలో కవ్వంతో మజ్జిగ చిలుకుతూ పాడే "తెల్లవారా వచ్చే తెలియకా నా స్వామి మళ్ళీ పడుకున్నావులేరా'' పాట శ్రావ్యంగా విన్పిస్తూ వుండేది. అందమైన కల కరిగిపోయిందే అని చెడ్డ కోపం వచ్చేది.

ఇంక నానమ్మ మేలుకొలుపు ప్రారంభించేది.

"అమ్మలూ ఆడపిల్లవు. త్వరగా లేవటం అలవాటు చేసుకోమ్మా'' అంటూ నాయనమ్మ చేసిన అలవాటు ఎంత మంచిదో ఆనాడు కాదు ఈనాడు తెలుస్తోంది.

ఇంక పండుగల్లో చెప్పలేనంత సంతోషం. అక్కలూ - బావలూ వస్తూన్నారంటే సంతోషం. వెడుతున్నారంటే విషాదం. ఆ బాల్యం ఎంత బాగా గడిచింది!

ఇంక పెళ్ళి ప్రయత్నాలు అయినాయి.

ఓ పెళ్ళికొడుకు వచ్చాడు. చూశాడు. వెళ్ళాడు.

"పెళ్ళికొడుకు ఎలా వున్నాడే అమ్మలూ" నానమ్మ రహస్యంగా అడిగింది.

"నువ్వూ చూశావుగా?" కోపంగా అన్నాను.

"నీ ఉద్దేశ్యం చెప్పమ్మా" నానమ్మ నవ్వుతూ అంది.

"నువ్వు చెప్పే కథల్లోని రాజకుమారుడిలా లేడు!"

నానమ్మ బోసి నోటితో నవ్వింది.

"అమ్మలూ కథలు వేరూ జీవితం వేరమ్మా" అంది వేదాంతిలా చూస్తూ.

"అతని పేరు అసలు నచ్చలేదు. వినాయక రావుట. ఛీ" అన్నాను ఉక్రోశంగా.

"అదీ వాళ్ళ తాతగారి పేరుట. పేరు విషయం వదిలెయ్యి. కానీ కుర్రాడు బావున్నాడు కదూ"

"చెల్లాయ్ అతని పేరు వినాయకరావు సరే అతను కుడుముల పోటీలో రెండుసార్లు పాల్గొని గెలిచాడుట" అన్నయ్య మాటది.

నానమ్మ మళ్ళీ నవ్వింది.

"ఆ తిండిపోతు పెళ్ళికొడుకు నాకొద్దు" అంటూ బుంగమూతి పెట్టాను. అయినా నానమ్మ నా మాటని కేర్ చెయ్యలేదు.

"అబ్బాయ్ ఈ సంబంధం అన్నివిధాలా బావుంది. ఖాయం చేసేయి" అంది కొడుకుతో.

"యాభై వేల కి ఒక్క పైసా కూడా తగ్గమంటున్నారమ్మా" అన్నాడు నాన్న.

"అయినా ఫర్లేదు. నాపేరున వున్న ఎకరం పొలం అమ్మేద్దాం" అంది. అంటే అది ఆర్డరే. దానికి తిరుగులేదు.

ఆ రాత్రి రోజూ అలవాటుగా కథ ప్రారంభించింది. నానమ్మ రాజకుమారుడి వర్ణన మార్చేసింది. ఈ రాజకుమారుడు పాంటూ షర్టూ వేసుకుని గుర్రం బదులుగా స్కూటరెక్కి వచ్చాడు. వెర్రి ముఖాన్ని అంతా 'వూ' కొడుతూ విని తర్వాత అనుమానం వచ్చి ఆలోచిస్తే సాయంకాలం వచ్చిన పెళ్లికొడుకు ఆకారం కళ్ళముందు ప్రత్యక్షమైంది.

నానమ్మ చిలిపితనం అప్పుడు అర్థమైంది.

"నీ కథ వినను. ఆ పెళ్ళికొడుక్కి గుమ్మడికాయంత బొజ్జ వుంది. నాకీ పెళ్ళి వద్దు" అన్నాను కోపంగా.

"అతని పేరే వినాయకరావు మరి బొజ్జ వుండదూ? అయినా అతడు చాలా మంచివాడుట అమ్మలూ. భర్త అందగాడు కాదు మంచి మనసున్నవాడు కావాలమ్మా. మీ తాతయ్య మంచివారు. కనకనే నా జీవితం "పూలతేరు"లా సాగిపోయింది. పిచ్చి తల్లీ ఎంతో అనుభవంతో చెప్తున్నాను. నా మాట వినమ్మా" అంటూ తన మెడలోని నాలుగు వరసల చంద్ర హారాన్ని తీసి నా మెడలో వేసింది. అంతే నా మనసులో సంకోచం ప్రారంభమైంది. ఈ పెళ్ళి ఒప్పుకోవటానికి నానమ్మ యీ గొలుసుని 'యెర' చూపుతోందా అని. ఆ తర్వాత నానమ్మ మాటకి తలవంచి వినాయకరావుని పెళ్ళి చేసేసుకున్నాను. వినాయకరావు చెయ్యి పట్టుకుని కొత్త కాపురంలోకి అడుగుపెట్టాను. అంతే, నా కలల్లో రాజకుమారుడు కన్పించటం మానేశాడు.

ఆ బాల్యంలో ఎంత అమాయకత్వం. ఈ కాలంలో పిల్లల్లో మచ్చుకు కూడా అమాయకత్వం కన్పించటం లేదు. వయస్సుకి మించిన తెలివిగా కన్పిస్తున్న వీళ్ళని చూస్తూంటే చికాకు వస్తూంటుంది. వీళ్ళలా పెరగటానికి కారణం!

సినిమాలూ, టీ.వీ.లూ, ఇంగ్లీషు చదువులూ పట్నవాసం జీవితాలూ చిన్న కుటుంబాలూ అయి వుండవచ్చు.

నా బాల్యం అలా గడిచినా ఆ రోజులు ఇప్పుడు లేవు. నానమ్మ లేదు. అమ్మా నాన్నా లేరు. అన్నయ్య అమెరికా వెళ్ళిపోయాడు. నేను ఒంటరిగా మిగిలాను.

ఇప్పటి విషయానికొస్తే అంతా హడావుడే. ఇవాళ ఆదివారం పిల్లలిద్దరూ ఎలాగూ లేవరు. శ్రీవారినన్నా లేపుదాం అని బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాను.

"లేవండీ!" అన్నాను దుప్పటి లాగుతూ. ఏడు గంటలయిందని టైమ్ కూడా చెప్పాను.

"అమ్మా ఆశ ఇవాళ ఆదివారం. తొమ్మిదింటికి లేపు. అప్పటికి టమాటో బాత్ వేడి వేడిగా చేసి వుంచు" అంటూ ముసుగు బిగించేశారు.

నాకు ఒళ్ళు మండింది.

"ఇవాళ ఆదివారం. కనుకనే అప్పలమ్మ రానని కబురెట్టింది. నేనా గిన్నెలు కడగలేను. ఇవాళ టిఫిన్ నై... వంట నై... మీ ఇష్టం."

"ఆదివారం అయితే అప్పలమ్మ ఎందుకు రాదుటా" లేచి కూర్చుంటూ అడిగారు.

"ఆదివారమే దాని మొగుడికి శలవుట. ఇద్దరూ కల్సి సినిమాకి వెళ్ళాలిట."

అక్షరం, అక్షరం ఒత్తి పలుకుతూ అన్నాను.

"సత్యా దాని కబుర్లుకి నువ్వు జాలిపడకూడదోయ్. నీ జాలి గుండె చూసే అది టోకరా వేసేస్తూ వుంటుంది."

"అచ్చం మీలానే."

శ్రీవారు గతుక్కుమన్నారు.

"క్రితం ఆదివారం నేను పని వుందని చెప్పి, ఆఫీసుకి కాక సినిమాకి వెళ్ళాననుకో. అది చూసిందనుకో. అయినా నీకు చెప్పాలా?"

"అంతేకాదు. మీ ఆఫీసరుగారు భార్యతో రవీంద్రభారతిలో డాన్స్ ప్రోగ్రాంకి రావటం, మీరు వాళ్ళవెంట దారి చూపిస్తూ వచ్చి కుర్చీలు చూపటం, చేతులు కట్టుకుని నిలుచోవడం" కోపం ఆపుకోలేక అన్నాను.

"నీకెలా తెల్సు."

"నేను నా ఫ్రెండ్‌తో ఆ ప్రోగ్రాంకి వచ్చాను గనుక."

శ్రీవారి ముఖం మటమటలాడసాగింది.

"అంతే కాదు వెంకటేశ్వర్రావు ఇంట్లో పేకాటలో ఎంత డబ్బు పోగొట్టుకుని వచ్చారో కూడా నాకు తెల్సు. ఈ విషయంలో నా మాట కాస్త కూడా వినటం లేదు. నేనిది భరించలేను."

శ్రీవారికి చెమటలు పట్టేశాయి. అయినా స్థిమితాన్ని తెచ్చుకుంటూ లేచి "సత్యా కొన్ని విషయాలు తెల్సినా తెలియనట్లుండాలి. ఇలా నిలబెట్టి అడగటం సభ్యత కాదోయ్" అన్నారు.

"సభ్యత" అంటే నాకు అర్థం తెలియదు కదూ?" అంటూ అక్కడి నుంచి హాలులో కాళ్ళ సోఫాలో కూర్చుండిపోయాను.

పన్నెండు గంటలు అయిపోయింది. పిల్లలిద్దరూ 'ఆకలి' ఆకలి' అంటూ నా కోపాన్ని చూసి తండ్రి దగ్గరకు చేరారు. శ్రీవారు వంట ప్రయ




నర్తకి
వాణీ కృష్ణమూర్తి

ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ లయోలా అకాడమీ (అల్వాల్)లో చదువుతున్న వాణి ఏడు సంవత్సరాల వయసులో భరతనాట్యం నేర్చుకోవటం మొదలుపెట్టాక నాటి నుండి ఈనాటి వరకూ సుమారు 60 నాట్య ప్రదర్శనలు కాకినాడ, రాజమండ్రి, విశాఖపట్నం, వాడి మొ॥ ప్రాంతాలలో ఇచ్చారు.

"శ్రీ వి.యస్. రామమూర్తి, శ్రీమతి మంజులా రామస్వామి వద్ద 'థియరీ, ప్రాక్టికల్స్, నట్టువాంగం - ఈ మూడింటినీ నేర్చుకుంటున్నాను." అంది వాణి.

"జతులు, అలరిప్పు, వర్ణం, పదం, శబ్దం, తరంగం చేశాను. మోహినీ భస్మాసుర నృత్య నాటికలో పాల్గొన్నాను." అనే వాణి నాట్య పోటీలలో రెండుసార్లు బంగారు పతకాలను సాధించింది.

-సి. లలితాకృష్ణ

త్వంలో సతమతమవుతున్నారు. ఇల్లంతా గందరగోళంగా వుంది.

"తిక్క కుదరాలి" లోలోపల సంతృప్తిపడుతూ అలాగే కూర్చుండి పోయాను.

ఇంతలో వాకిట్లో ఆటో ఆగింది. 'ఎవరు?' విసుగ్గా చూశాను.

చేతిలో సూట్‌కేసుతో ఏడాదిక్రితం పెళ్ళి అయి కలకత్తాలో భర్త దగ్గర కాపురం చేస్తూ వాళ్ళ అన్యోన్య దాంపత్యం గురించి వారానికో ఉత్తరం రాస్తున్న శ్రీవారి గారాల చెల్లెలు సుకన్య రావటం చూసి ఆశ్చర్యంతో లేచి దగ్గరగా వెళ్ళాను.

"ఏమిటీ ఉత్తరమన్నా రాయకుండా ఇలా వచ్చేశావ్" అన్నాను, అప్పటి నా కోపం మర్చిపోయి.

"వదినా!" అంటూ అమాంతం వచ్చి కావులించేసుకుంది సుకన్య.

"అత్త వచ్చిందోచ్! అత్త వచ్చింది" అంటూ పిల్లలిద్దరూ పరుగున వచ్చేశారు.

"కారం పప్పు పిండీ వగైరా అంటుకున్న తువ్వాలు భుజం మీద వేసుకుని చెల్లెలి దగ్గరగా వస్తూ కుశలప్రశ్నలు వేయసాగారు శ్రీవారు.

"ఏమ్మా నువ్వు ఒంటరిగా ఇలా హటాత్తుగా వచ్చావేంటీ. బావగారేరీ" అంటున్న అన్నగార్ని హత్తుకుపోయి...

"అన్నయ్యా" అంటూ పెద్దగా ఏడవసాగింది.

"ఏమ్మా ఏమైంది" గాబరాపడిపోతూ అడగసాగారు.

"శివరాం మంచివాడనీ పెద్ద ఉద్యోగం చేస్తున్నాడనీ ఇంకా ఏవేవో చెప్పి లక్ష కట్నం ఇచ్చి నాకీ పెళ్ళి చేశారు నువ్వూ నాన్నా కల్సి. పెళ్ళి అయిన నేను కలకత్తా వెళ్ళిన మూడు నెలలు నన్నెంతో బాగా చూశాడు. కానీ తర్వాత సరిగా ఇంటికి రాకపోవటం, జీతం అంతా తాగుడికీ రేసులకీ తగలేస్తూ తిరుగుతున్నారన్నయ్యా." అంటూ వెక్కి వెక్కి ఏడవ సాగింది సుకన్య.

"ఆ... శివరాం అలా చేస్తున్నాడా?" చెల్లెలి తల నిమురుతూ బాధగా అడిగారు.

'అవునన్నయ్యా! నేనెంతో ప్రయత్నించాను. ఆయనని ఆ అలవాట్ల నుంచి మార్చాలని. అతను వినటం లేదు. పైగా 'నా అలవాట్లు మానుకోను. వుంటే వుండు పోతే ఫో' అన్నాడు."

"ఆ..." శ్రీవారి ముఖం కోపంతో ఎర్రబడింది. శివరాం గనుక ఎదురుగా వుంటే చావబాదేసేంత కోపం ఆ కళ్ళలో కన్పిస్తోంది.

"అన్నయ్యా నేను ఇంక ఆ మొగుడితో కల్సి వుండలేను. నాకు డైవోర్సు కావాలి. ఈ విషయం నాన్నకి ఇష్టం వుండదు. అందుకే అమ్మా నాన్నా దగ్గరకి వెళ్ళలేదు. వదినా నా బాధని అర్థం చేసుకోగలరని మీ దగ్గరకు వచ్చాను. ఒదినా..." అంటూ నాదగ్గరకి వచ్చింది సుకన్య. కన్నీరు తుడుస్తూ -

"సుకన్యా! కన్నీరు రానీయకు. నీకిష్టం లేని వ్యక్తితో కల్సి బ్రతకమని నేను చెప్పను. నాకూ ఇష్టంలేని పేకాట వ్యసనాన్ని మీ అన్నయ్య వదలటం లేదు. నా అయిష్టాన్ని ఎన్నిసార్లు చెప్పినా ఆయన కాస్త కూడా వినటం లేదు. పద మనం ఇద్దరం బైటికి పోదాం. మన కాళ్ళమీద మనం నిలబడి బ్రతుకుదాం" అంటూ సుకన్య చేయి పట్టుకుని లేవదీయ బోయాను.

"ఒదినా? ఏమిటిది! అన్నయ్యని వదిలి బైటకి వెళ్ళిపోతావా?" టక్కున ఏడుపు మానేసి నా ముఖంలోకి ఆశ్చర్యంగా చూడసాగింది.

"ఔను సుకన్యా. మీ అన్నయ్య కూడా పేకాట వ్యసనానికి జీతంలో సగం డబ్బు తగలేస్తున్నారు. ఇలా అయితే ఆ ఇద్దరు పిల్లలనీ పెంచి పెద్ద చేయటం చదువులు చెప్పించటం ఎలా? వాళ్ళ భవిష్యత్తు ఏంగాను? నువ్వే చెప్పు" ఉబికి వస్తున్న కన్నీళ్ళని ఆపుకుంటూ అన్నాను. సుకన్య నమ్మలేనట్టుగా చూస్తూ.

"అన్నయ్యా వదిన చెప్పేదంతా నిజమా?" నిలదీసినట్లు అడిగింది.

శ్రీవారు తలదించుకున్నారు.

"సుకన్యా చూశావుగా. పద పోదాం" అన్నాను ధృఢంగా అడుగులు వేస్తూ.

"సత్యా నీ బాధ నాకర్థమైంది. జన్మలో మరెప్పుడూ 'ఆ వ్యసనం' జోలికి పోను. మన ఇద్దరం కల్సి వుంటేనే పిల్లల భవిష్యత్తుని తీర్చిదిద్దగలం. సుకన్య సమస్యకీ ఓ పరిష్కారం చూడగలం" అంటూన్న శ్రీవారి మీద కోపమూ వచ్చింది, జాలీ వేసింది.

తన చెల్లెలికి బాధ కలిగినప్పుడు కానీ నా బాధని అర్థం చేసుకోలేనందుకు కోపమూ ఇప్పటికైనా ఓ మంచి నిర్ణయం తీసుకున్నందుకూ సంతోషమూ కల్గింది. కానీ నేను ఇంట్లో నుంచి వెళ్ళిపోతున్నానన్నప్పుడైనా అమాయకత్వంతో "వెళ్ళవద్దమ్మా" అని నా దగ్గరగా రాని శశీ, బాబూ ని చూస్తూ 'హు ఈ తరం పిల్లలు' అనుకుంటూ వంటగదిలోకి నడిచాను. కానీ శశి, బాబూ గుసగుసగా మాట్లాడుకోవటం విని ఆగాను.

"బాబూ ఏంటీ మమ్మీ డాడీని అలా బెదిరిస్తోంది. మమ్మీ పద్ధతి నాకు నచ్చలేదు" అంటోంది నా కూతురు నేను పెంచుతున్న కూతురు శశి.

"అవును, నాకూ నచ్చలేదు" అంటున్నాడు బాబు.

ఈ మాటలు విన్న నేను నిర్ఘాంతపోయాను.

ఈతరం పిల్లల్లో అమాయకత్వం లేదు కానీ... ఆలోచన వుంది.



## సంగీత విదుషీమణి
## నీలా రాంగోపాల్

శ్రీమతి నీల, కుంభకోణంలో శ్రీ శఠగోపాచారి వద్ద సంగీతం నేర్చుకోవడం ప్రారంభించి, ఆ తర్వాత 'సంగీత భూషణ' శ్రీ టి.ఎ. రంగాచారి వద్ద తన కళకి మెరుగులు దిద్దుకున్నారు. ఎ.ఐ.ఆర్.లో బి గ్రేడ్ ఆర్టిస్ట్ అయ్యారు, క్రమంగా తిరుచ్చి, మంగుళూర్. ఆకాశవాణి కేంద్రాలు ప్రేక్షకుల సమక్షంలో వీరి ప్రోగ్రాంలని ఏర్పాటు చేశాయి. బెంగళూర్ విజయ మ్యూజిక్ కాలేజీ, భారతీయ విద్యా భవన్, కేంద్రీయ విద్యాలయ, మైసూర్ యూనివర్శిటీల్లో ఈమె ఇచ్చిన లెక్చర్ డిమాన్‌స్ట్రేషన్లు విశేషంగా అందర్నీ ఆకర్షించటంతో పాటు మంచి పేరు తెచ్చాయి.

1965 నుంచి 'ఎ' గ్రేడ్ ఆర్టిస్టుగా గుర్తింపు పొంది మద్రాస్, హైద్రాబాద్, బెంగుళూర్ టీ.వీ.లలో కూడా అనేక ప్రోగ్రాం లిచ్చారు. కృష్ణగాన సభ, ది ఇండియన్ ఫైన్ ఆర్ట్స్ సొసైటీ, మద్రాస్ మ్యూజిక్ అకాడమీలలో పాల్గొన్నారు. 'బెస్ట్ జూనియర్ విద్వాన్'గా కృష్ణగానసభ నుండి, 1980 మద్రాస్ మ్యూజిక్ అకాడమీ నుండి బెస్ట్ పరఫార్మర్ అవార్డు, 1983లో నాగర్‌కోయిల్ ట్రస్టువారి "గాన ప్రకీర్తి" బిరుదు పొందారు.

-అ. రాజ్యశ్రీ